నమోదులో జాప్యం తగదు

- రేషన్‌కార్డుల్లో నేటికీ చేరని కొత్త సభ్యుల పేర్లు
- ఏళ్లుగా ఎదురుచూస్తున్న దరఖాస్తుదారులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న లబ్ధిదారులు
- పట్టించుకోని అధికారులు



దౌల్తాబాద్: పేదలకు ప్రభుత్వం అందించిన ఆహార భద్రత కార్డుల్లో కొత్త వారి పేర్ల నమోదులో జాప్యం చేస్తున్నారు. మండలంలో చాలా మంది అర్హత ఉన్నా అటు కొత్తకార్డులు రాక, ఉన్నవాటిలో పేర్లుక లపక లబ్ధిదారులు సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంలో పట్టించుకునే అధికారులు కరువయ్యారు. అనర్హుల పేరిట రేషన్‌కార్డుల తొలగింపుపై ఉన్న శ్రద్ధ దరఖాస్తు చేసుకున్న కొత్తవారి పేర్లను నమోదు చేసే వారు లేరు. కార్డులను తొలగించే పనిలో ఉన్న అధికారులకు పేర్లను చేర్చడంలో ఎందుకు ఆసక్తి లేదని దరఖాస్తు దారులు ప్రశ్నిస్తున్నారు. దీంతో వారికి ఎండ్ల తరబడి నిరీక్షణ తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బియ్యం రాక...ఆరోగ్య శ్రీ అందక...

మండలంలో అర్హులైన లబ్ధిదారుల పేర్లు కార్డులో నమోదు కాకపోవడంతో రేషన్‌బియ్యం రావడం లేదు. ఆరోగ్యశ్రీ సేవలు కూడా అందడంలేదు. ప్రతి సంక్షేమపథకానికి రేషన్‌కార్డు ఉండడంతో లబ్ధిదారుల పేర్లు రేషన్‌కార్డులో ఎక్కకపోవడంతో వారు అయోమయానికి గురవుతున్నారు. మూడేళ్ల క్రితం బీఆర్‌ఎస్ ప్రభుత్వం అర్హులకు కొత్త రేషన్‌కార్డులు జారీ చేసింది. రాష్ట్రం ఏర్పడక ముందు రేషన్‌కార్డు ఉన్న దంపతుల పిల్లల పేర్లు ఇప్పటికీ రేషన్‌కార్డుల్లో నమోదు చేయలేదు. దీంతో ఆహార భద్రతకు నోచుకోవడంలేదు. ఆపదలో ఆరోగ్యశ్రీ వైద్యం అందడం లేదు. రేషన్‌కార్డులో పేర్లు చేర్చాలని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ఏళ్ల గడుస్తున్నా నమోదుకు అవకాశం లేదు. పెళ్లయిన ఆడపిల్లల పేర్లు తొలగిస్తున్నా అధికారులు పెళ్లయి అత్తింటికి వెళ్లిన అమ్మాయిల పేర్లను ఎందుకు చేర్చడంలేదని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇలాంటి దరఖాస్తులు తహశీల్దార్ కార్యాలయాల్లో గుట్టలుగా పేరుకుపోతున్నాయి. కాని వాటికి మోక్షం మాత్రం కలగడం లేదు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ త్వరలోనే కొత్త రేషన్‌కార్డులు జారీ చేస్తామని ప్రకటించింది. దీనికోసం అక్టోబర్ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని ప్రకటనలు చేసి నేటికీ ఆ ఊసేలేదు. ఆరేండ్లుగా కార్డులు లేక అటు ఉచిత బియ్యానికి, ఇటు ఆరోగ్యశ్రీ సేవలకు దూరమవుతున్నామని పేదలు లబోదిబో మంటున్నారు.

పేరు నమోదుకు దరఖాస్తు చేసుకున్నా



నాకు పెళ్లయి సుమారు 12 సంవత్సరాలు. నా ఇద్దరు పిల్లల పేర్లను రేషన్‌కార్డులో చేర్చాలని నాలుగేళ్ల క్రితమే దరఖాస్తు చేసుకున్నాను. ఇప్పటికీ పిల్లల పేర్లు నమోదు కాలేదు. పెద్దమ్మాయి తొమ్మిదోతరగతి అయినా కార్డులో ఇంకా నమోదు చేయలేదు.

– బాబుజీ, దౌల్తాబాద్

ఎలాంటి ఆదేశాలు రాలేదు

కొత్త రేషన్‌కార్డుల విషయంపై ఎలాంటి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వం కొత్త కార్డులు మంజూరు చేయాలని ఆలోచలో ఉంది. అయితే త్వరలో విధివిధానాలు ఖరారు చేస్తారని తెలిసింది. కొత్త కార్డులు, కొత్తగా పేర్ల నమోదు విషయం ప్రభుత్వం ఆధీనంలో ఉంది.

– గాయత్రి, తహశీల్దారు, దౌల్తాబాద్

నిధులు మంజూరు చేయాలని వినతి

స్పీకర్‌ను కోరిన ఎంఐఎం అధ్యక్షుడు మోయిజ్‌ఖురేషి

ధారూరు: ధారూరు మండల కేంద్రంలోని ఊర్దు మీడియం పాఠశాలకు, ఈద్గాకు ప్రహరీ నిర్మాణాల కోసం రూ.10 లక్షల చొప్పున నిధులు మంజూరు చేయాలని బహదూర్‌పురా ఎమ్మెల్యే మహ్మద్ ముబిన్ బుధవారం శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను కోరారు. మండల ఎంఐఎం అధ్యక్షుడు మోయిజ్‌ఖురేషి ద్వారా సిఫారసు పత్రాన్ని స్పీకర్ ఇంటికి పంపించారు. స్పీకర్ ఎండాస్ చేసి సూచించిన మేరకు ఆ లెటర్‌ను మోయిజ్‌ఖురేషి కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా మోయిజ్‌ఖురేషి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఊర్దుమీడియం పాఠశాలకు ప్రహరీ లేక పందులు, పశువులు సంచరిస్తున్నాయని, దీంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మార్కెట్‌యార్డు వెనకాల నిర్మించిన ఈద్గాకు ప్రహరీ లేక ప్రార్థనల సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఈ విషయాన్ని స్పీకర్ దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరునకు స్పీకర్ చర్యలు తీసుకోవాలని కోరారన్నారు.



స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు వినతి ప్రతం అందజేస్తున్న మోయిజ్‌ఖురేషి తదితరులు

పొలాలకు రోడ్డు వేయించాలని నిరసన

తాండూరు రూరల్: పొలాలకు వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం కల్పించాలని బుధవారం గ్రామ శివారులోని సోలార్ ప్లాంట్ ఎదుట రైతులు నిరసన వ్యక్తం చేశారు. వారికి ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సిములు మాదిగ, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు శేఖాపూరం ఆంజనేయులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గతంలో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసే సమయంలో గ్రామంలోని ఊరడమ్మ దేవాలయం నుంచి పొలాలకు వెళ్లేందుకు రోడ్డు ఏర్పాటు చేయిస్తామని మాట ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పటికైనా సంబంధిత యాజమాన్యం స్పందించి రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. లేనిచో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని సంబంధిత వ్యక్తులు హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. ఈ కార్యక్రమంలో మోహన్‌రెడ్డి, రవి, విజయ్ కుమార్, వెంకటయ్య, కుత్‌బోద్దీన్, మొగులప్ప, గోపాల్, ఎల్లయ్య, నర్సిములు, గౌసోద్దీన్, కృష్ణ, రాములు తదితరులు పాల్గొన్నారు.



సోలార్ ప్లాంట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

ఆలస్యంగా బస్సు సర్వీసు!

ఆర్టీసీ అధికారులతో మాట్లాడిన ఎస్‌ఐ

యాలాల: సాయంత్రం వేళ బస్సు సర్వీసు ఆలస్యం అవుతుందని, ఇంటికి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని హాజీపూర్ గ్రామానికి చెందిన విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం గ్రామంలో నిర్వహించిన ఓ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి ఎస్కార్టుగా వచ్చిన ఎస్‌ఐ శంకర్ యాలాల నుంచి హాజీపూర్ నడుచుకుంటూ వెళ్తున్న విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రతీరోజు సాయంత్రం బస్సు ఆలస్యంగా వస్తున్న విషయాన్ని ఎస్‌ఐ దృష్టికి తెచ్చారు. స్పందించిన ఆయన ఫోన్‌లో ఆర్టీసీ అధికారులతో మాట్లాడారు. సాయంత్రం వేళ బస్సు ఆలస్యమవుతున్న విషయం వాస్తవేమనని, అధ్వానంగా మారిన రోడ్ల వల్ల ఈ పరిస్థితి నెలకొందని అధికారులు ఎస్‌ఐకి సమాధానమిచ్చారు.



ఫోన్‌లో విద్యార్థుల సమస్యను ఆర్టీసీ అధికారులకు వివరిస్తున్న ఎస్‌ఐ శంకర్

విగ్రహాలను ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి

సనాతన ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు

కొడంగల్: దేశంలో హిందుత్వాన్ని కాపాడుకోవాలని, దేవతల విగ్రహాలను ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సనాతన ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని శివాజీ చౌక్ నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. హిందూ సంస్కృతిని నాశనం చేయాలనే దుర్మార్గపు చర్యలను ఖండించారు. దేశంలో మెజారిటీ ప్రజల మనోభావాలను గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. అనంతరం ఎస్‌ఐ సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సనాతన ధర్మ పరిరక్షణ సమితి అధ్యక్షుడు కోట్రికె లక్ష్మీనారాయణ గుప్తా, హిందూ సంఘాల ప్రతినిధులు రవీందర్ నాయక్, ప్రవీణ్‌కుమార్, నగేశ్‌కుమార్, కూర వెంకటయ్య, పవన్‌లాహోటీ, నర్సింహ, బాకారం శేఖర్, వడ్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌ఐకు వినతి పత్రం ఇస్తున్న సనాతన ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు

అదనంగా బస్సులు నడపాలి



మాట్లాడుతున్న రాజుకుమార్‌గౌడ్

ఎస్‌ఎఫ్‌ఐ నియోజకవర్గ ప్రెసిడెంట్ రాజుకుమార్‌గౌడ్

కొడంగల్ రూరల్: అదనంగా ఆర్టీసీ బస్సులు నడపాలని ఎస్‌ఎఫ్‌ఐ కొడంగల్ నియోజకవర్గ ప్రెసిడెంట్ రాజుకుమార్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ఓ పాఠశాల ఆవరణలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రుద్రారం గ్రామం నుంచి కొడంగల్ ప్రాంతానికి పాఠశాల సమయంలో రెండు బస్సులను నడిపించాలని డిమాండ్ చేశారు. రుద్రారం, టేకుల్‌కోడ్, అన్నారం, అంగడిరాయిచూర్, లక్ష్మీపల్లి, చిట్లపల్లి, సంఘాయిపల్లి తదితర గ్రామాల నుంచి పాఠశాలలు, కళాశాలలకు కొడంగల్, తాండూర్, కోస్గి తదితర పట్టణాలకు విద్యార్థులు వెళ్తున్నారన్నారు. ఈ క్రమంలో సమయానికి బస్సులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. రుద్రారం గ్రామం నుంచి కొడంగల్ ప్రాంతానికి ఒకే బస్సు నడుస్తుండడంతో ఆయా గ్రామాల నుంచి విద్యార్థులు కిక్కిరిసి ప్రయాణం చేయాల్సివస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పరిగి, తాండూర్ డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సులను 8ట్రిప్పులకు పైగా నడిపించేవారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఒకే బస్సు ఉండడంతో ఇబ్బందులకు గురవుతున్నట్లు చెప్పారు. ఈ విషయంలో ఆర్టీసీ అధికారులు స్పందించి విద్యార్థులతో పాటు ప్రయాణికుల ఇబ్బందులు తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ నాయకులు అనిల్, నగేష్, నరేష్, స్రవంతి, గోపాల్, పావని, స్పందన, అశ్విని, శేఖర్, చాంద్‌పాషా, నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో శ్రమదానం

బంట్వారం: బంట్వారం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అధికారులు, సిబ్బంది శ్రమదానం చేశారు. ఎంపీడీఓ రాములు, ఎంపీఓ నాగరాజు పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది, జీపీ వర్కర్లు కార్యాలయాన్ని శుభ్రం చేశారు. కొన్నేళ్లుగా పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని సంచుల్లో నింపించి ట్రాక్టర్‌లో తీసుకెళ్లి బయట పారవేశారు. అనంతరం కార్యాలయ ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా జీపీ వర్కర్లను అధికారులు శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాములు, ఎంపీఓ నాగరాజు, జీపీ వర్కర్లు పాల్గొన్నారు.



శ్రమదానం చేస్తున్న అధికారులు, సిబ్బంది

చిరుత కాదు.. అడవి పిల్లి

ఎఫ్‌ఆర్‌ఓ రాజేందర్

యాలాల: ఇటీవల రేళ్లగడ్డ తండాలో చిరుత సంచారం మరిచిపోక ముందే జుంటుపల్లి రామస్వామి ఆలయ పరిసరాల్లో చిరుత లాంటి జంతువు సంచారం గ్రామస్తులతో పాటు భక్తుల్లో ఆందోళన రేకెత్తిస్తుంది. బుధవారం తెల్లవారుజామున జుంటుపల్లి రామస్వామి ఆలయ పరిసరాల్లో చిరుతను చూశామని, ఆలయ పరిసరాల నుంచి జుంటుపల్లి ప్రాజెక్టు వైపు వెళ్లిందని పగిడిపల్లి, జుంటుపల్లి గ్రామ ప్రజలు తెలిపారు. చిరుత విషయమై అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు. ఈ విషయమై ఫారెస్టు రేంజ్ అధికారి రాజేందర్ దృష్టికి తీసుకెళ్లగా జుంటుపల్లి రామస్వామి ఆలయ పరిసరాల్లో సంచరించిన జంతువు చిరుత కాదని, అడవి పిల్లి అని పేర్కొన్నారు. ఇటీవల కాలంలో రేళ్లగడ్డ తండాలో దూడను చంపిన చిరుతను గుర్తించేందుకు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో ఎలాంటి ఆనవాళ్లు లభించలేదన్నారు. దాడి అనంతరం చిరుత పులి రోజుకు 25 కిలోమీటర్ల మేర ప్రయాణం చేస్తుందన్నారు. జుంటుపల్లి, పగిడిపల్లి, అక్కంపల్లి గ్రామాల ప్రజలు అనవసరంగా ఆందోళన చెందొదన్నారు.

సురక్షితమైన తాగునీరు సరఫరా చేయాలి

ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ చల్మారెడ్డి

నవాబుపేట: గ్రామాల్లో ప్రజలకు సురక్షితమైన తాగునీరు సరఫరా చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ చల్మారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో వాటర్ మెన్‌లకు నిర్వహించిన శిక్షణకార్యక్రమం బుధవారం ముగింపు సందర్భంగా సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కలుషితమైన తా గునీరు వల్లే ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. మిషన్ భగీరథ తాగునీటి సరఫరా విషయమై వాటర్‌మెన్‌లకు శిక్షణ ఇచ్చామన్నారు. నీటి పరీక్షలు, పైపులైన్ల మరమ్మతులు,విద్యుత్ సమస్యలు, చేతిపంపుల మరమ్మతులు తదితర అంశాలపై అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈలు రత్నప్రసాద్, సువచ్చల, ఎంపీడీవో అనురాధ, ఏఈ సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టండి

పెద్దేముల్: విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈఓ నర్సింగ్‌రావు ఉపాధ్యాయులను ఆదేశించారు. బుధవారం మండల పరిధిలోని కందనెల్లి తండా ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యేవిధంగా శ్రద్ధ తీసుకోవాలన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్య అందించి మంచి ఫలితాలు సాధించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు.



కందనెల్లి తండా పాఠశాలను సందర్శిస్తున్న ఎంఈఓ నర్సింగ్‌రావు

విద్యతోనే సమాజంలో గుర్తింపు

మొయినాబాద్ రూరల్: విద్యతో వయస్సుకు పరిమితం లేదని, పట్టుదల, కృషి ఉంటే దేనినైనా సాధించగలరని చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ కులపతి డాక్టర్ సీ.హెచ్.వీ.పురుషోత్తంరెడ్డి, చీఫ్ అడ్మినిస్ట్రేట్ అధికారి డాక్టర్ సాత్విక రెడ్డిలు పేర్కొన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ సమీపంలో గల ఆ యూనివర్సిటీలో వాణిజ్య, వ్యాపార నిర్వహణ విభాగంలో ఇంపాక్ట్ ఆర్గనైజేషన్ క్లైమెట్ ఆఫ్ ఆర్గనైజేషన్ అనే అంశంపై ప్రొఫెసర్ కృష్ణమాచారి పర్యవేక్షణలో పి.మేఘశ్యామల పరిశోధన నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీలో పి.శ్యామలకు యూనివర్సిటీ కులపతి పురుషోత్తంరెడ్డి, అడ్మినిస్ట్రేట్ అధికారి సాత్వికరెడ్డిలు ఆమెకు డాక్టరేట్ పట్టాను అందజేశారు.

సంక్షిప్త వార్తలు

◆ కూలీలందరికి పని కల్పిస్తాం



బంట్వారం: జాబ్ కార్డు కలిగిన కూలీలందరికి ఉపాధి హామీ పథకంలో పని కల్పిస్తామని ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని రొంపల్లిలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. త్వరలోనే ఉపాధి హామీ పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తొర్మామిడి టెక్నికల్ అసిస్టెంట్ జంగయ్య, రొంపల్లి పంచాయతీ కార్యదర్శి వెంకట్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ భూమిని కాపాడండి

పెద్దేముల్: మండల పరిధిలోని మారెపల్లి తండా సమీపంలోని సర్వేనెంబర్ 116లో ఉన్న ప్రభుత్వ భూమిని కాపాడాలని తండా వాసులు కోరారు. బుధవారం తాండూరులో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్‌కుమార్, వెంకటేష్, సంతోష్, చందర్, రాములు, శ్రీనివాస్, రవి, మోహన్, లాల్, రాంశెట్టి, విజయ్, సాయిలు పాల్గొన్నారు.

◆ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

అనంతగిరి: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని జిల్లాలోని పోలీస్‌స్టేషన్ల పరిధిలో పాఠశాల విద్యార్థులకు ఆన్‌లైన్‌లో వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్పీ నారాయణ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాసరచన పోటీలను కేటగిరి వారిగా ఇంటర్ విద్యార్థులకు మొబైల్ వాడకం అనే అంశంపై, డిగ్రీ ఆపై విద్యార్థులకు తెలంగాణను డ్రగ్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నా పాత్ర అనే అంశంపై ఉంటుదని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఆన్‌లైన్‌లో ఈ నెల 28వరకు దరఖాస్తు సమర్పించాలని తెలిపారు.

◆ కమిషనర్‌కు సమ్మె నోటీస్ అందజేత

శంకర్‌పల్లి: రాష్ట్రంలో మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఈ నెల 25న హైదరాబాద్‌లోని సీడీఎంఏ ఆఫీస్ ఎదుట ధర్నా కార్యక్రమం చేపట్టింది. బుధవారం శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్‌కు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ ధర్నా నోటీసును అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అందజేయాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, జీవో నం.1037లో ప్రతిపాదనలు రద్దు చేయాలన్నారు. యూనియన్ అధ్యక్షుడు రమేశ్ ఉన్నారు.

క్లుప్తంగా

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్



ప్రత్యేక పూజలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్ తదితరులు

పరిగి: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ పేర్కొన్నారు. పట్టణ కేంద్రంలోని లక్ష్మీనరసింహాస్వామి తృతీయ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాల్లో బుధవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ మూర్తులకు నిర్వహించిన అభిషేకం, హోమం, నవకలశ స్నపన పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతిఒక్కరూ భక్తిమార్గాన్ని అనుసరించాలని సూచించారు. భక్తితో ముక్తి లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఎదిరె కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేతాజీ పాఠశాల విద్యార్థినికి కాంస్య పతకం



కాంస్య పతకంతో చైత్ర

తాండూరు టౌన్: స్పీడ్ క్యూబింగ్ పోటీల్లో తాండూరు పట్టణంలోని నేతాజీ గురుదేవ్ గురుకుల్ పాఠశాలలో ఎనిమిదోతరగతి చదువుతున్న కందుకూరి చైత్ర కాంస్య పతకం సాధించింది. బుధవారం హైదరాబాద్‌లో స్కూల్ ఫెడరేషన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పీడ్ క్యూబింగ్ విభాగంలో ఆమె ఈ ఘనత సాధించింది. చాంపియన్‌షిప్-24 పేరుతో ఎస్‌ఎఫ్‌ఏ 6వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో అండర్-14 విభాగంలో 41 సెకన్లలో పూర్తి చేసింది. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, సహచరులు చైత్రను అభినందించారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

పరిగి: విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఏబీవీపీ నాయకులు పేర్కొన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. స్కాలర్‌షిప్‌లు ప్రభుత్వ భిక్ష కాదు, విద్యార్థుల హక్కు అని పేర్కొన్నారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వకుండా ప్రభుత్వం కాలయాపన చేయడం బాధాకరమన్నారు. అంతే కాకా ఫీజురీయింబర్స్‌మెంట్‌ను కూడా వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంస్కృతి ప్రత్యేకం



వాల్యానాయక్ తండాలో గోర్ సీక్వాడి

కుల్కచర్ల: గిరిజన సంస్కృతి ప్రత్యేకమైనదని గిరిజన సంఘాల నాయకులు పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని వాల్యానాయక్ తండాలో గోర్ సీక్వాడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బంజారాల సంప్రదాయం, ఆరాధ్యదైవం సేవాలాల్, హతిరాం బాపు, గురు లోకాలాల్ వంటి మహనీయుల గురించి వివరించారు. సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకుంటూ అందరికీ ఆదర్శంగా నిలిచేలా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శంకర్ నాయక్, గోబ్రియానాయక్, గాంగ్యానాయక్, బావోజీచందర్, మోతిలాల్, సింధు, రెడ్యా, రాంచందర్, పాండు, హన్మంతు, బల్సింగ్, ఘని పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించండి

యాలాల: ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించడంలో పీఆర్టీయూ సంఘం ముందుంటుందని మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణారెడ్డి, రాములు పేర్కొన్నారు. బుధవారం సంగాయగుట్ట తండా, గోరేపల్లి గ్రామాల్లో సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడారు. డీఎస్సీలో ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులు తమ సంఘంలో చేరడం సంతోషంగా ఉందన్నారు. అంతకుముందు విధుల్లో చేరిన ఉపాధ్యాయులను సన్మానించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొగులయ్య, ప్రభాకర్‌చారి పాల్గొన్నారు.